క్లుప్తంగా


వార్షికోత్సవానికి ఆహ్వానం



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న నిర్వాహకులు

చేవెళ్ల: మండలంలోని గొల్లగూడ గ్రామంలో గల శ్రీ సాందీప అచల ఋషి పరిపూర్ణగుర మందిర వార్షికోత్సవంతో పాటు శ్రీసచ్చిదానంద సాయానార్యుల 51వ వార్షికోత్సవ కార్యక్రమాలు వచ్చే నెల 2న నిర్వహించనున్నారు. ఇందుకుగాను ఆదివారం మండల బీజేపీ నాయకులతో కలిసి వెళ్లిన గురుమందిర వ్యవస్థాపకుడు దయానంద నాగుల వెంకటేశం వార్షికోత్సవానికి రావాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో గురుమందిర నిర్వాహకుడు శంకర్‌గురుప్రసాద్, నాయకులు అనంత్‌రెడ్డి, డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కృష్ణమోహన్, మచ్చేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అభి తదితరులు ఉన్నారు.

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు



వనభోజనాల్లో పాల్గొన్న పద్మశాలీలు

కేశంపేట: మండల కేంద్రంలో ఆదివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పద్మశాలీలు కుటుంబ సమేతంగా వనాలకు వెళ్లి అక్కడే వంటావార్పు చేసుకున్నారు. అనంతరం సామూహిక వన భోజనాలు చేసి ఆటాపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షుడు కోట చందు, గంజి సుధాకర్, గంజి చంద్రయ్య, వెంకటేశ్, హరికృష్ణ, శ్రీనివాస్, బాలకృష్ణ, రాములు, శ్రీనివాస్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

28న కొబ్బరికాయల వేలం

షాబాద్: మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో గల బుగ్గరామేశ్వరస్వామి దేవాలయం వద్ద జాతర సందర్భంగా కొబ్బరికాయల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య, దేవాలయ ఈఓ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన శుక్రవారం ఉదయం 10 గంటలకు దేవాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

మండల విద్యాధికారి పురన్‌దాస్



వేడుకల్లో పాల్గొన్న ఎంఈఓ పురన్‌దాస్, ఎస్‌ఐలు సంతోష్‌రెడ్డి, శిరీష, సిబ్బంది

చేవెళ్ల: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, అప్పుడే వారు భవిష్యత్తులో రాణించేందుకు అవకాశం ఉంటుందని మండల విద్యాధికారి పురన్‌దాస్ అన్నారు. మండల కేంద్రంలోని సిల్వర్‌డేల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే, వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ, ఎస్‌ఐలు సంతోష్‌రెడ్డి, శిరీష హాజరయ్యారు. ఆయా తరగతుల విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కరెస్పాండెంట్ మోహన్‌చారి, ప్రిన్సిపాల్ సునీతారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపాతాళ త్రికోణ మహాసుందరి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న ఆలయ ధర్మకర్త, గ్రామస్తులు

శంకర్‌పల్లి: మండలంలోని పర్వేద అనుబంధ గ్రామమైన కొత్తగూడలో శ్రీపాతాల త్రికోణ మహాసుందరి 20 అడుగుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిపించారు. ఆలయ ధర్మకర్త మాధవరెడ్డితో గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అధ్వానంగా శంకర్‌పల్లి-చేవెళ్ల రహదారి

ఐదేళ్లుగా అసంపూర్తిగానే..

శంకర్‌పల్లి-చేవెళ్ల రహదారి విస్తరణ పనుల్లో జాప్యం

- నరకయాతన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

శంకర్‌పల్లి: పట్టణం నుంచి వికారాబాద్, చేవెళ్ల రహదారి విస్తరణ పనులు ప్రారంభించి దాదాపు ఐదేళ్లు కావొస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. దీంతో నిత్యం సుదూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు, కూరగాయలు తీసుకొని వెళ్లే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా పనులు నిలిచిపోయినా అధికారులు ఇవేవి తమకు సంబంధం లేనట్లు వ్యవహరించడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రహదారి విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

2020లో శంకుస్థాపన

శంకర్‌పల్లి పట్టణ చౌరస్తా నుంచి ఫత్తేపూర్ రైల్వే వంతెన వరకు(చేవెళ్ల, వికారాబాద్ వెళ్లే రహదారిలో) కిలోమీటరు మేర నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆ పనులకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3.06కోట్లను మంజూరు చేయగా.. విద్యాశాఖ మంత్రి 2020 జూలైలో శంకుస్థాపన చేశారు. ప్రణాళిక ప్రకారం విస్తరణ పనులు ఆరు నెలల్లో పూర్తి కావాల్సి ఉంది. కానీ దాదాపు ఐదేళ్లు కావొస్తున్నా నేటికీ పూర్తి కాకపోవడం గమనార్హం.

గుంతలను పూడ్చి..

ఈ రహదారిపై నిత్యం వికారాబాద్, చేవెళ్ల, నవాబ్‌పేట్, మోమిన్‌పేట్, మర్పల్లి తదితర మండలాల నుంచి వేలాది మంది రైతులు తమ కూరగాయలను హైదరాబాద్ తీసుకెళ్తారు. అదే విధంగా విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం పాఠశాల, కళాశాల, ఆఫీసులకు వెళ్లేందుకు ఈ రహదారినే ఆశ్రయిస్తారు. పనుల్లో భాగంగా రోడ్డుపై వేసిన అరకొర కంకర అంతా వాహనాలకు కొట్టుకుపోతోంది. దీంతో రోడ్డుపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడతాయి. స్థానికులు ఫిర్యాదు చేయడంతో మున్సిపాలిటీ సిబ్బంది తాత్కాలికంగా గుంతల్లో మొరంవేసి పూడ్చి వేయగా.. మళ్లీ యథాస్థితి కొనసాగుతోంది. వర్షాకాలంలో అయితే సమస్య వర్ణనాతీతం. పనుల జాప్యంపై ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగే ప్రయత్నం చేయగా.. పనులు దక్కించుకున్న సదరు గుత్తేదారు సక్రమంగా పని చేయడం లేదని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సమాధానం ఇస్తున్నారు.

సమస్యగా మారనున్న దుకాణాలు

ఈ రహదారి పక్కన కొన్నేళ్ల నుంచి పదుల సంఖ్యలో కొంత మంది చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఖచ్చితంగా ఈ దుకాణాలను తొలగించాల్సి ఉంటుంది. అయితే వారిని ఎలా ఖాళీ చేయించాలి అనే విషయంపై అధికారులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

సూచనలకే పరిమితం..

శంకర్‌పల్లి నుంచి చేవెళ్ల, వికారాబాద్ రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాల గురించి సీఐ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ యోగేశ్ ఆరా తీశారు. రహదారి విస్తరణ పనులు పూర్తయితే సమస్యలు తగ్గుతాయని గుర్తించి, ఆర్‌అండ్‌బీ డీఈఈ రమేశ్, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి సంయుక్తంగా కొన్నిరోజుల క్రితం రోడ్డును పరిశీలించి, పలు సూచనలు చేశారు. పనులను దక్కించుకున్న సదరు గుత్తేదారుని తెప్పించామని, మిగిలిన పనులకు సంబంధించి మళ్లీ అంచనా వేసి, టెండరు పిలవనున్నట్లు తెలిపారు. గడిచిన రెండేళ్లలో అధికారులు 15రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పడమే తప్పా, ప్రారంభించిన దఖలాలు లేవు.

త్వరలో పరిష్కరిస్తాం

కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న నెలరోజుల్లోనే ఈ రహదారి విస్తరణ పనులపై అనేక ఫిర్యాదులు అందాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులతో కలిసి పరిశీలించి, సమీక్ష సమావేశం నిర్వహించాను. అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేను కలిసిన ఆయన సహకారం తీసుకొని ముందుకెళ్తాం. త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం.

– యోగేశ్, మున్సిపల్ కమిషనర్

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 1983లో పదో తరగతి చదివిన విద్యార్థులు 42 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమతో పాటు చదవి మరణించిన తోటి విద్యార్థులకు, చదువు బోధించిన మరణించిన వారి ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.

సమాజ సేవలో ముందుండాలి

ట్రైబల్ వెల్ఫేర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నీతాపోలె



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

కేశంపేట: సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలని షాద్‌నగర్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నీతాపోలె అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఆదివారం కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో కలిసి స్వచ్ఛత ర్యాలీ, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలను నిర్వహించడంతో విద్యార్థులు సామాజిక సేవ, పౌరుల బాధ్యతలను తెలుసుకోవచ్చన్నారు. సేవా గుణం కలిగిన విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. గ్రామీణ స్థాయిలో సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గ్రామంలో ముళ్ల పొదలను తొలగించారు. గ్రామ ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయం గోడలపై స్వచ్ఛత ఆవశ్యకత, నీటి సంరక్షణ కొటేషన్లను రాశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఘు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం అధికారి అప్రోజాహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నిధుల కేటాయింపుపై హర్షం



కొందుర్గు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు, ప్రజలు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల వాసులు ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పూల వర్షం కురిపిస్తు ఘనంగా స్వాగతం పలికారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర బడ్జెట్‌లో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం నిధులు కేటాయించడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఆదివారం మండలానికి వచ్చిన ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం లాల్‌పహాడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో వంద అబద్ధాలు ఆడారని, ఎక్కడ సమావేశం పెట్టినా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మిస్తామని చెబుతూ ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కుర్చీవేసుకొని ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పి, పదేళ్లలో ప్రాజెక్టుకు తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పూర్తిచేసి, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉమ్మడి కొందుర్గు మండల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నానన్నారు. షాద్‌నగర్–పరిగి నాలుగు లేన్ల రోడ్డును త్వరలోనే మంజూరి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల అధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పిట్ట రజిత, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లతోనే గ్రామాల అభివృద్ధి

నందిగామ: రోడ్లు, మౌలిక వసతుల కల్పనతోనే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్, అనుబంధ గ్రామం సత్వేంద్రిగూడలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంగాపూర్‌లో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ. 20లక్షలు, సత్వేంద్రిగూడలో రూ.6లక్షల వ్యయంతో సీసీరోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నందిగామ పీఏసీఎస్ చైర్మన్ రాజగోపాల్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలు



బోనాల ఊరేగింపు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో ఆదివారం మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో నుంచి ఆలయం వరకు బోనాల ఊరేగింపు చేపట్టారు. డోలు తాళాల చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. మహిళలు బోనాలను తీసుకెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కుకున్నారు. ఉత్సవాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

షాబాద్: మండల పరిధిలోని మీరాపూర్ దర్గాలో ఆదివారం మత పెద్ద చెన్నబాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సర్వమత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్గొండగూడ మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, దర్పల్లి రవీందర్‌గౌడ్, మైనార్టీలు మతీన్, ఎండీ మజీద్, షఫీ, అరీఫ్, ఆయూబ్, రుక్మద్దీన్, షమీం తదితరులు ఉన్నారు.



స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

చేవెళ్ల: మోదీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాలుగో మహాసభలను రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిటీ ఆదనంగా 50శాతం జోడించి రైతులకు మద్దతు ధరలను నిర్ణయించాలన్నారు. రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులు, కార్మికులు, కర్షకులపై దాడులు, దోపిడీ పెరిగిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర రైతు సంఘం మూడో రాష్ట్ర మహాసభలను రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో 21 మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. జిల్లా గౌర అధ్యక్షుడిగా రామ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా మాధవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రభులింగంను ఎంపిక చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, నాయకులు రామకృష్ణ, సుధాకర్‌గౌడ్, రామిరెడ్డి, సుభాన్‌రెడ్డి, సత్తిరెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, సత్యానారాయణ, మక్బుల్, అంజయ్య, మంజుల, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



నందిగామ: రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు



షాద్‌నగర్‌రూరల్: రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నందిగామ: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియామకమైన రాజ్‌భూపాల్‌గౌడ్‌ను మండల పరిధిలోని నర్సప్పగూడకు చెందిన ఆ పార్టీ నాయకులు ఆదివారం ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీకి సేవ చేస్తూ, పార్టీకి విధేయుడిగా ఉన్న రాజ్‌భూపాల్‌గౌడ్‌కు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్, నాయకులు ఎన్కిరాల నర్సింహగౌడ్, మంగలి మల్లేశ్, చాకలి అశోక్, ఎంఎం యాదవ్, బంటారం వెంకటేశ్‌గౌడ్, నక్కల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడికి అభినందన

చేవెళ్ల: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను ఆదివారం ఆయన నివాసంలో మండల నాయకులు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, వెంకట్రామిరెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బి.కృష్ణయాదవ్, కరుణాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కృష్ణమోహన్, జస్వంత్, రిషికేశ్‌గౌడ్, మాణిక్యరెడ్డి, ధనుశ్‌రెడ్డి, సందీప్‌గౌడ్, నాగరాజు, నవీన్ తదితరులు ఉన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

షాద్‌నగర్‌రూరల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెట్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. భవిష్యత్‌లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బీజేపీతోనే సబ్బండ వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, ప్రజలందరికీ పార్టీ విధివిధానాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కాసోజు శివ, మురళీధర్‌రెడ్డి, గడిగెల కిరణ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రాజు, మనోహర్, రాఘవేందర్, శ్రీనాథ్, రాజు, అజయ్, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో..

జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రాజ్‌భూపాల్‌గౌడ్‌ను బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు సురేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ యువతకు ఆదర్శం



షాద్‌నగర్: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ మనోహర్ తదితరులు

షాద్‌నగర్: స్వాతంత్ర్య పోరాటయోధుడు భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. భగత్‌సింగ్ 98వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో యూటీఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘం, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ వీరోచితమైన పోరాటం చేశారని, ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, నాయకులు చంద్రశేఖర్, బిజిలి సత్యం, రవి, శ్రీనివాస్, రాములు, కుర్మయ్య, శ్రీను నాయక్, నర్సింలు, ఈశ్వర్, శ్రీకాంత్, శివ, పద్మారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

పోరాటం స్ఫూర్తిదాయకం

షాద్‌నగర్‌రూరల్: విప్లవ చైతన్యానికి మారుపేరు భగత్‌సింగ్ అని, ఆయన పోరాట పటిమను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుడ్డ నర్సింహ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట బస్టాండ్ ఆవరణలో ఆదివారం నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్, నాయకులు శివ, గుడ్డోళ్ల యాదయ్య, శివోళ్ల యాదయ్య, శేఖర్‌రెడ్డి, శ్యాంకుమార్, జగదీశ్, యాదయ్య, ఎండీ.ఆజం, భీమయ్య, శ్రీను, సురేశ్, గోవింద్, రంగయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, అశోక్, వినయ్, వంశీ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవవీరుడు భగత్‌సింగ్

చేవెళ్ల: విప్లవ నిప్పుకణం భగత్‌సింగ్ అని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయస్సులోనే ఉరి తాడును ముద్దాడి ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప వీరుడని కొనియాడారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజగురుల త్యాగం ఎప్పటికీ మరిచిపోలేమని, మహనీయులను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దేవేందర్, సమీర్, చందు, చరన్‌గౌడ్, తేజ, మురారి, గాయత్రి, శిరీష, మౌనిక, కవిత తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్‌రూరల్: ఎలికట్టలో..



చేవెళ్లలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు